

చిత్తూరు నగరం లేబెబండలో లబ్ధిదారులను మంగళవారం పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి తదితరులు

జిల్లాలో పట్టాల వివరాలు

మ్యాపింగ్ చేసిన పట్టాలు: 25,186

ఇప్పటివరకు రీవెరిఫికేషన్ చేసినవి: 3150

అర్హత కలిగినవి: 3121

అర్హత లేనివి: 29

ఖాళీ ప్లాట్లు: 585

విచారణ దశలో ఉన్నవి: 22,036

● అర్హులకు కొత్తగా మంజూరు

వైసీపీ హయాంలో పట్టా పొందని అర్హులకు కొత్తగా పట్టాలను అందించనున్నట్లు ఇదివరకే కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారితో పాటు అర్హులు సుమారు 11 వేల మంది పట్టా కోసం వేచి చూస్తున్నారు. అప్పట్లో పట్టణాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు స్థలాన్ని పట్టాగా ఇవ్వగా.. ఇప్పుడు రెట్టింపు అంటే, పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాన్ని పంపిణీ చేయనున్నారు.

బయటపడుతున్న బోగస్ పట్టాలు

● జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల అర్హతపై సర్వే వేగవంతం

● ఆందోళనలో అనర్హులు, వైసీపీ శ్రేణులు

చిత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల లబ్ధిదారుల అర్హతపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి సర్వే ప్రారంభమైంది.జిల్లాలో వైసీపీ ప్రభుత్వం 25,186 మందికి జగనన్న లేఅవుట్లలో పట్టాలను పంపిణీ చేసింది. క్షేత్రస్థాయిలో 3150 పట్టాలను పరిశీలించగా 3121 పట్టాలు అర్హులకు ఇచ్చినట్లు, 29 పట్టాలు అనర్హులకు ఇచ్చినట్లు తేలింది. 585 ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు.

● సర్వే కోసం ప్రత్యేక యాప్

అక్రమ పట్టాల గుట్టు విప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ సోమవారం నుంచి యాక్టివ్ కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. స్థలాలు ఎవరికి ఇచ్చారు? అర్హులా? కాదా? గతంలో వీరికి స్థలాలిచ్చారా? సొంతిల్లు ఉందా? స్థితిగతులేమిటి...... ఇలా సుమారు 12 అంశాలను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సర్వే బాధ్యతను పూర్తిగా వీఆర్వోలకు అప్పగించగా.. తహసీల్దార్, ఆర్డీవో స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలు బయటపడతాయని అనర్హులతో పాటు వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

● అనర్హుల లెక్క తేల్చేది ఇలా..

బీపీఎల్ కేటగిరీలోకి రానివారిని, ఇల్లు లేదా ఇంటి స్థలం ఉన్నవారిని, గతంలో గృహనిర్మాణ పథకం వినియోగించుకున్నవారిని,10 ఎకరాల వ్యవసాయ భూమి కలిగినవారిని, ఆదాయ పన్ను చెల్లించిన వారిని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నవారిని అనర్హులుగా పరిగణిస్తారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా, ఒకే కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ ప్లాట్లు కలిగి ఉన్నా, తమ ప్లాట్‌ను ఇతరులకు విక్రయించినా అనర్హులే అవుతారు. లబ్ధిదారులు స్థానికంగా లేకపోయినా, అవివాహితుల పేరిట ఉన్నా, మైనర్లకు ఇచ్చినా అనర్హులని అధికారులు చెబుతున్నారు.



ఈమె పేరు శ్యామలమ్మ. కుప్పం పట్టణం బైరుగానిపల్లె లేఅవుట్‌లో 432వ ప్లాటును కేటాయిస్తున్నట్లు పట్టా అందించారు.కానీ, ఈమెకు ఇప్పటివరకూ స్థలాన్ని చూపించలేదు.

● మండలాల్లో బృందాల నియామకం

డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు, సర్వేయర్ల బృందం గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన పట్టాలను రీవెరిఫికేషన్ చేయాలని ఈ నెల 5న సీసీఎల్ఏ ఆదేశాలను జారీ చేసింది. ఇందుకు వీఆర్వోల లాగిన్‌తో హౌస్ సైట్ రీ-వెరిఫికేషన్ యాప్ ను అందుబాటులోకి తెచ్చింది.



ఈమె పేరు అముద. కుప్పం మున్సిపాలిటీ మర్రిమాను వీధిలో అద్దె ఇంట్లో కాపురం ఉంటోంది. కూలి పనులు చేసుకుని బతికే ఈమెకు ఎన్నికల సమయంలో వలంటీర్లు ఇంటి పట్టా అందించి ఫొటో తీసుకున్నారు. తర్వాత ఆ పట్టాను కూడా వెనక్కి తీసుకెళ్లిపోయారు. ఇంతవరకు ఆమెకు స్థలాన్ని చూపించలేదు.

గుడ్‌బై జెన్నీ

రిటైరైన పోలీసు శునకానికి ఘనంగా వీడ్కోలు



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని సాయుధ దళ కార్యాలయంలో మంగళవారం జెన్నీ అనే పోలీసు శునకం పదవీ విరమణ కార్యక్రమాన్ని పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మణికంఠ హాజరై జెన్నీకి పూలమాల వేసి శాలువాకప్పి సన్మానించారు.పలు కేసుల దర్యాప్తులో పోలీసుశాఖకు జెన్నీ అందించిన సేవలను కొనియాడారు.డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్‌బీ సీఐ భాస్కర్, ఆర్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.గోల్డెన్ రిట్రైవర్ జాతికి చెందిన ఈ శునకం హైదరాబాదులోని మొయినాబాద్‌లో వున్న ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో ఎనిమిది నెలల పాటు శిక్షణ తీసుకుంది.వీఐపీల పర్యటనల్లో, కాణిపాకం, తిరుమల బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలందించింది.

కల్లూరులో కిలో చికెన్ రూ.100

కల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ ప్రబలుతోందన్న ప్రచారంతో చికెన్ ధరలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే వారంగా చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. పులిచెర్ల మండలం కల్లూరులో మంగళవారం కిలో చికెన్ రూ.100 పలికింది. అయినప్పటికీ మాంసప్రియులు మటన్, చేపల కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు.

తిరుపతికి నేడు మంత్రి లోకేశ్ రాక

తిరుపతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం తిరుపతి రానున్నారు. ఉదయం 9 గంటలకల్లా తిరుపతి టీడీపీ కార్యాలయం చేరుకుని మధ్యాహ్నం దాకా పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు.పార్టీ పరిస్థితిని లోతుగా సమీక్షిస్తారని సమాచారం.మధ్యాహ్నం 2 తర్వాత మహిళా వర్సిటీలో ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తారు.విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఐటీసీఎక్స్ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సాయంత్ర 6.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

కారు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి



ద్విచక్రవాహనాన్ని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు.సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు.... బంగారుపాళ్యం మండలం కరిడివారిపల్లెకు చెందిన హేమశేఖర్ కుమారుడు గౌతమ్(21), తగ్గువారిపల్లెకు చెందిన బాబు కుమారుడు ఉమాపతి(15) మంగళవారం రాత్రి మొగిలివెంకటగిరికి ద్విచక్రవాహనంపై వెళ్లారు.తిరిగి వస్తుండగా బంగారుపాళ్యంలోని ఆర్ఆర్ నగర్ సమీపంలో ఉన్న ట్రాక్టర్ షెడ్డు వద్ద పలమనేరు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌతమ్, ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ కారును రోడ్డుపక్కనే వదిలి పరారయ్యాడు.చిత్తూరు సీతమ్స్‌లో గౌతమ్ బీటెక్ ఫస్టియర్ చదువుతుండగా ఉమాపతి స్థానికంగా పదవతరగతి చదువుతున్నాడు. ప్రమాద విషయం తెలిసి సంఘటనా స్థలం వద్దకు చేరుకున్న మృతుల తల్లిదండ్రులు భోరున విలపించారు.



ఉమాపతి (ఫైల్ ఫొటో)



మృతిచెందిన గౌతమ్

టెన్త్ విద్యార్థిని మృతి కేసు

దర్యాప్తు ముమ్మరం

పలమనేరు, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థిని బిడ్డను ప్రసవించి మృతి చెందిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.పలమనేరు మండలానికి చెందిన ఆ బాలిక ప్రేమ పేరుతో మోసపోయి గర్భవతి కావడంతో అనారోగ్యం పాలైంది.చివరకు వైద్యులు ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశాక ఆమె మృతి చెందింది.పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను ప్రేమ పేరుతో మోసం చేసినవారిని గుర్తించే పనిలో పడ్డారు.బాలిక గ్రామానికి చెందిన కొందరు అదృశ్యం కావడంతో వారిని ఈ కేసులో అనుమానితులుగా భావిస్తున్నారు.వారికి సన్నిహితంగా ఉన్న వారిని విచారిస్తున్న పోలీసులు త్వరలోనే నిందితులను అరెస్టు చేయనున్నట్లు తెలుస్తోంది.కాగా తిరుపతి రుయాస్పత్రిలో చనిపోయిన బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం సోమవారం రాత్రి గ్రామానికి తీసుకు వచ్చారు.ఈ సందర్భంగా ఆమెను మోసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని గ్రామస్తులు డిమాండు చేశారు.అక్కడికి చేరుకొన్న సీఐ నరసింహరాజు వారికి నచ్చజెప్పారు.మంగళవారం బాలికకు అంత్యక్రియలు జరిపారు.ఆ గ్రామంలో ఇలాంటి సంఘటనలు రెండు జరిగినట్లు చెబుతున్నారు.కాగా బాలిక గ్రామాన్ని మంగళవారం సీడీపీవో ఇందిరాప్రియదర్శిని సందర్శించారు. బాలిక జన్మనిచ్చిన మగశిశువును ఆమె తల్లిదండ్రులకు అప్పగించే విషయమై చర్చించారు.అయితే తమకు కొంత వ్యవధి ఇవ్వాలని బాలిక తల్లిదండ్రులు కోరారు.

పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా ఉమ

● నేడు బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ నూతన వీసీగా ఆచార్య వెన్నం ఉమ నియమితులయ్యారు.మూడేళ్ల పాటు ఆమె వీసీ పదవిలో కొనసాగనున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. వీసీగా నియమితులైన ఉమకు మహిళా వర్సిటీ ఆరంభ కాలం నుంచీ నాలుగు దశాబ్దాలకుపైగా అనుబంధం ఉంది. ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్‌లో 1983లో ఎంఏ పూర్తి చేశారు. 1989-1992 మధ్య ఇంగ్లాండ్ కామన్‌వెల్త్ అకడమిక్ స్టాఫ్ స్కాలర్‌షిప్‌పై యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ అంగిలియాలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1983 నుంచి మహిళా వర్సిటీలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. 2007-09 మధ్య సోషియల్ సైన్స్, లా, మేనేజ్‌మెంట్ స్కూల్ డీన్‌గా.. 2007-10లో సోషియల్ వర్క్ విభాగాధిపతిగా.. 2011-13 లో హాస్టల్స్ వార్డెన్‌గా.. 2013-14లో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీవోఏ) డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2015 నుంచీ యూజీసీ నాక్ పీర్ టీం సభ్యురాలిగా కొనసాగుతున్నారు. 2016-2020 మధ్య రెక్టార్‌గా పని చేశారు. ఇన్‌చార్జి వీసీగానూ పనిచేశారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం నుంచీ ఉత్తమ అధ్యాపక అవార్డు, 2022లో ఎన్టీఆర్ సెంటెనరీ అవార్డు ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ పురస్కారాన్ని పొందారు. వీసీగా బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఉద్యోగులు, విద్యార్థుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఆకతాయికి దేహశుద్ధి



ఐరాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని వైఎస్ గేటులో ఓ ఆకతాయికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కాణిపాకానికి చెందిన భూపాల్ రెడ్డి ఆర్టీసీ బస్సులో ఓ బ్యాంకుకు చెందిన మహిళా ఉద్యోగులను వేధించేవాడు. మంగళవారం అతడి వేధింపులు శ్రుతిమించడంతో మహిళా ఉద్యోగులు భరించలేకపోయారు. వైఎస్ గేటులో బస్సు దిగగానే స్థానికులకు విషయం తెలిపారు. ఆగ్రహించినవారు ఆకతాయిని పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం భూపాల్ తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. మరోసారి మహిళా ఉద్యోగులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

తిరుపతిని 'ఎర్రర్ ఫ్రీ సిటీ'గా మారుద్దాం

● 'నక్ష' సర్వే సర్వే బ్రోచర్ల విడుదలలో కలెక్టర్ పిలుపు

తిరుపతి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు తెర దించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'నక్ష (నేషనల్ జియో ఫేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) సర్వే ద్వారా తిరుపతిని ఎర్రర్ ఫ్రీ సిటీగా మారుద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. నక్ష సర్వే కింద తిరుపతి ఎంపికైన నేపథ్యంలో మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నక్ష సర్వే ద్వారా భూ రికార్డులను లోపరహితంగా తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భూ సమస్యలు తిరుపతి జిల్లాలో ఉన్నాయన్నారు. తాజా సర్వే విషయం యజమానికి తెలియజేసి పారదర్శకంగా చేపట్టాలన్నారు. పక్కాగా ఉండే రికార్డులు తయారు కావాలని ఎంపీ గురుమూర్తి,ఎమ్మెల్సీ సుబ్రమణ్యం ఆకాంక్షించారు. డిజిటల్ అసిస్టెంట్స్, ఎమినిటీస్ సెక్రటరీ సంబంధిత అధికారులు సర్వేను జాగ్రత్తగా చేపట్టాలని కమిషనర్ మౌర్య సూచించారు. కొత్త సర్వే ద్వారా వివాదాలకు చెక్ పెట్టాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ అనిత, ఏడీసీ చరణ్‌తేజ్, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ దేబబ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్, డీసీపీ మహాపాత్ర, తహసీల్దారు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.29 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,784

తలనీలాలు సమర్పించినవారు: 25,521



ఐటీసీఎక్స్‌లో స్టాళ్ల సందడి



తిరుపతి అర్బన్/ఎంఆర్‌పల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆశ కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025(ఐటీసీఎక్స్)లో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద మంగళవారం సందడి నెలకొంది. ఆలయాలకు, పెద్ద సంస్థలకు, జనాలకు ఉపయోగపడే ఎన్నో పరికరాలను స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే..



దుర్లబ్ దర్శన్

ఈ పరికరాన్ని కళ్లకు అమర్చుకుంటే మహంకాళి, ఓంకారేశ్వర్, భీమ్‌శంకర్, కాశీవిశ్వనాథ్, జ్యోతిర్లింగం, అయోధ్య రామమందిరం వంటి ఉత్తరాదిన ఉండే ప్రముఖ ఆలయాలను ప్రత్యక్షంగా సందర్శించిన అనుభూతి కలుగుతుంది. దీనిని భోపాల్‌కు చెందిన టేక్‌ఎక్స్ ఆర్ మెలన్ సంస్థ తయారు చేసింది. దీని ధర రూ. 3వేలు.

'మహా' సంస్కృతి వాయిద్యాలు

మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఏర్పాటుచేసిన 'మహా' సంస్కృతి వాయిద్యాల ప్రదర్శన అలరిస్తోంది. ఉత్తరాదిలోని షిరిడి, మహాలక్ష్మి, త్రయంబకేశ్వర్, విటల్‌రుక్మిణి, సిద్ధివినాయక, బీమ్‌శంకర్, రామతక్ వంటి ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలలో 60రకాల సంప్రదాయ, జానపద వాయిద్యాలతో ప్రదర్శనలు ఇస్తుంటారు.





ప్రత్యేక ఆకర్షణగా ఉడిపి వాయిద్యం




కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన వాయిద్యకారులలు గంట పాటు స్టాళ్ల వద్ద చేసిన ప్రదర్శన డెలిగేట్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రాంతం కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



గాల్లో ఎగిరే మానవరహిత యంత్రం

ముంబైకి చెందిన ఏరోస్విస్ట్ టెక్నాలజీ సంస్థలో తయారైన గాల్లో ఎగిరే మానవరహిత యంత్రాలతో అనేక ఉపయోగాలున్నాయి. అత్యవసర పరిస్థితులు, వరద ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీరు, మందులు అందించవచ్చు. భద్రతా చర్యలకూ ఉపయోగపడుతుంది. ఎత్తయిన ప్రాంతాలు, గాలిగోపురాల శుభ్రతకు వినియోగించుకోవచ్చు. వీటి ప్రారంభ ధర రూ.పాతికవేలు నుంచి రూ.3కోట్ల వరకు ఉంది.



మైమరిపించే డిజిటల్ బోర్డులు

బెంగళూరుకు చెందిన అరమ్ వరల్డ్ ద్వారా ఆలయాలకు చక్కగా ఉపయోగపడే డిజిటల్ సొల్యూషన్ బోర్డు, ఎల్ఈడీ వీడియోవాల్, ఇన్ఫర్మేషన్ కియాస్క్, క్యూఆర్‌కోడ్ బోర్డు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, క్యూలైను మ్యానేజ్‌మెంట్ సిస్టమ్, త్రీడీ అక్షరాలతో సూచిక, బ్యానర్ బోర్డులు తయారవుతున్నాయి. వీటి ధరలు రూ.4వేల నుంచి రూ.40లక్షల వరకు ఉంది. ఇప్పటి వరకు శ్రీశైలంఆలయం, బనశంకరి ఆలయాల్లో నేమ్ బోర్డు తయారు చేయించారు.



గోపురాలకు బంగారుపూత

చెన్నైకి చెందిన మంత్రగోల్డ్‌కోటింగ్ సంస్థ గోల్డ్ ఎలక్ట్రోప్లేటింగ్ టెక్నాలజీ ద్వారా ఆలయాల గోపురాలకు, ధ్వజస్తంభాలకు, విమానాప్రాకారాలకు బంగారుపూత వేస్తోంది. దాదాపు పాతికేళ్ల వరకు పసిడివర్ణం తన స్వభావాన్ని కోల్పోదని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటి వరకు విజయవాడ కనక మహాలక్ష్మి, యాదిగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు తమ సేవలను అందించారు. ఇళ్లలో పూజించే చిన్న చిన్న విగ్రహాలనూ తయారుచేస్తారు.



భక్తిభావం పెంచేలా..

ఆరోమి సంస్థ ఆన్‌లైన వేదికగా దేవుడి ప్రతిమలను కీచైన్స్, టీషర్ట్స్ మీద ముద్రించి అమ్మకాలు చేపడుతోంది. ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించాలన్నది ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం.

కళాత్మక బల్బులు

ఢిల్లీకి చెందిన ఓరియన్ ఎలక్ట్రిక్ సంస్థ సరికొత్త డిజైన్లతో, ఆయా సంస్కృతులకు అనుగుణంగా బల్బులను తయారు చేస్తోంది. శ్రీనగర్‌లోని గంగోత్రి వంతెన, గుజరాత్‌లోని సుదర్శన్‌సేతు, హిమాచల్‌ప్రదేశ్‌లోని బాక్రానంగల్ ప్రాజెక్టుకు, అయోధ్య రామ మందిరం, పరిసరాలలో 700వీధిలైట్లు అమర్చారు. ఇతర ప్రముఖ ఆలయాల సంస్కృతి, సంప్రదాయం ఆధారంగా వీధిలైట్లు అమరిక, ఆటోమెటిక్‌గా వివిధ రంగులు ప్రదర్శించే ఆర్జీబీ లైట్ల 1,500 రకాలున్నాయి. వీటి ప్రారంభ ధర రూ.5వేల నుంచి రూ. 8లక్షల వరకున్నాయి.





ఆకట్టుకునే ట్రైబల్ ఆర్ట్స్

ఆ స్టాల్‌లో అడుగు పెట్టగానే, అనేక దేవాలయాలకు సంబంధించిన కళలు, దేవుళ్ల ప్రతిమలు, ప్రాచీన విగ్రహాలు, సంప్రదాయ బొమ్మలు ఆకట్టుకుంటాయి. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌కు చెందిన ట్రైబల్ ఆర్ట్స్ ఇవి. ఉత్తరాది చేనేత వస్త్రాలనూ ప్రదర్శనలో ఉంచారు.



స్మార్ట్ లాకర్

ఆలయాల్లో భక్తుల లగేజీలను భద్రపరుచుకోవడానికి స్మార్టు లాకర్ చక్కగా ఉపయోగపడుతోంది. భక్తులు, ప్రయాణికులు, ఉద్యోగులు స్వయంగా పిన్ నెంబరు, మొబైల్‌యాప్, క్యూఆర్‌కోడ్, బయోమెట్రిక్, ఫేస్‌రికగ్నేషన్ ఆర్ఎఫ్ఐడీ కార్డులను ఈ లాకర్‌లో సద్వినియోగం చేసుకోవచ్చు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సదుపాయం కలిగి ఉండాలి. ఇప్పటి వరకు జమ్మూలోని వైష్ణోదేవి ఆలయంలో 220, చెన్నైలోని రైల్వేస్టేషన్‌లో 88 లాకర్లు అమర్చారు. వీటిని పుణేలోని పూణెకు చెందిన ఫాన్సెల్ స్మార్ట్ సంస్థ ప్రదర్శించింది.



ఏటీఎం ద్వారా గోల్డ్ కాయిన్స్

ఏటీఎం ద్వారా బంగారు, వెండి నాణేలు కొనుగోలు చేయవచ్చు. ఏ రోజు బంగారు, వెండి ధర ఉంటుందో అక్కడ ప్రదర్శించబడుతుంది. 5గ్రాముల నుంచి 10 గ్రాముల కాయిన్స్‌ను మనం కొనుగోలు చేయవచ్చు.





ఐటీసీఎక్స్‌లో శ్రీవారి కల్యాణోత్సవం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం, విశ్వశాంతి కోసం తిరుపతిలోని ఐటీసీఎక్స్-2025లో భాగంగా శ్రీమన్నారాయణయాగ క్రతువు నిర్వహిస్తున్నారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చిన శ్రీవారి మూలవర్లు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు, సీతాలక్ష్మణ సహిత శ్రీరామచంద్రుడు, శ్రీమన్నారాయణుడు, నీలాదేవి విగ్రహాలను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ నుంచి రాత్రి 9గంటలకు ఏకాంతసేవ వరకు అన్ని కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించారు. బుధవారం పుష్పయాగం జరగనుంది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి 25మంది ఆగమ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్రతువు కొనసాగుతోంది. మొత్తం ఏడు హోమగుండాలు ఏర్పాటు చేసి నిరంతరాయంగా శ్రీమన్నారాయణ హోమం జరుగుతోంది. బుధవారం పూర్ణాహుతితో హోమం పరిసమాప్తం కానుంది. యజ్ఞాచార్యులుగా గుడిమెల్ల నరసింహాచార్యులు, బ్రహ్మగా పవనకుమారాచార్యులు వ్యవహరిస్తున్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆగమపండితులు



సదస్సులో ప్రసంగిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

వేదికపై టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, పారిశ్రామికవేత్త ఏజే శేఖర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్ఎస్ఎస్ జాయింట్ సెక్రటరీ సునీల్‌దేశ్ పాండే, చిత్రంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఆర్ఎస్ఎస్ ఇన్‌చార్జి భరత్, గిరేష్‌కులకర్ణి



కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభం

వైభవంగా ధ్వజారోహణం



స్వామి అమ్మవార్ల సమక్షంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి 29: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు తిరుచ్చిపై ధ్వజపటంతో పాటు తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవర్ల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ ధ్వజారోహణం జరిగింది. వైఖానన శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ ప్రత్యేకాధికారి, సీవీఆర్వో డాక్టర్ రవి, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, శేషాద్రిచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.



పెద్దశేషుడిపై వైకుంఠనాథుడు

రాత్రి పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, గోవింద నామస్మరణలు నడుమ శ్రీదేవి, భూదేవి సమేతంగా కృష్ణావతారంలో తిరుమాడ వీధుల్లో స్వామి ఊరేగారు. అంతకు ముందు ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు.

మంగాపురంలో లడ్డూ ప్రసాదాలు: జేఈవో

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేసినట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీనివాస మంగాపురంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచామన్నారు. టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో వాహన మండపం పక్కన ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జేఈవో ప్రారంభించారు.

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య సేవలు

22న గరుడసేవ, 23న స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం. వాహనసేవలు: ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 8 గంటల వరకు.

చిన్నారికి అనూహ్య ప్రమాదం

ఆటలాడుతుండగా గౌనుకు నిప్పంటుకుని పరిస్థితి విషమం - సాయం కోసం తండ్రి వేడుకోలు





చికిత్స పొందుతున్న లక్ష్య

వి.కోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆట్లాడుకుంటుండగా ప్రమాదానికిలోనై మృత్యువుతో పోరాడుతున్న తన కుమార్తెకు సాయం చేయమని ఓ తండ్రి అర్థిస్తున్నాడు. వి.కోట మండలం గాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ దుర్గాప్రసాద్ కుమార్తె లక్ష్య(6) ఆదివారం సాయంత్రం పిల్లలతో ఆటలాడుతూ స్నేహితురాలి ఇంటివద్దకు పరుగు తీసింది. అక్కడ గడప వద్ద వెలిగించిన దీపం గౌనుకు తగలడంతో మంటలు అలముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు నీళ్ళుపోసి మంటలను అదుపు చేశారు.అప్పటికే 60శాతం శరీరం కాలిపోవడంతో హుటాహుటిన కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చిన్నారికి రెండు రోజుల పాటు చికిత్స అందించారు.పరిస్థితి కుదుట పడకపోవడంతో మంగళవారం రాత్రి చెన్నైలోని కేఎంసీ ఆస్పత్రికి తరలించారు.చికిత్సకు రోజూ రూ.లక్షల్లో ఖర్చవుతోందని, భరించే స్తోమత తమకు లేదని బాలిక తల్లి దండ్రులు లత, దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాతలు సాయమందించాలని అభ్యర్థిస్తున్నారు.ఫోన్‌పే నెంబరు 8618134582కు తోచినంత సాయం అందించాలని కోరుతున్నారు.కాగా వి.కోట లయన్స్ క్లబ్ తరఫున చిన్నారికి రూ. 52 వేలు సాయాన్ని అందించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ పీఆర్ ధీరజ్, కార్యదర్శి కోలా మురుగేష్ తెలిపారు.

మాధవరం రోడ్డుకు మోక్షం ఎప్పటికో..!

● 4 కిలోమీటర్ల పనులతో సులువు ప్రయాణం
● టీడీపీలో రూ.5.50 కోట్ల నిధుల మంజూరు ● వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు



ఆగిన రోడ్డు అభివృద్ధి పనులు



2018లో అభివృద్ధి చేసిన మట్టిరోడ్డు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా పెద్దపంజాణి మండలంలోని మాధవరం రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. వైసీపీ పాలనలో మాధవరం రోడ్డు పనులు పూర్తిగా ఆగిపోయాయి. మండలంలోని రాయలపేట ప్రాంతం, చౌడేపల్లి, సోమల, పుంగనూరు మండలాల్లోని దాదాపు 50 గ్రామాల ప్రజలకు చిత్తూరు జిల్లా కేంద్రానికి అత్యంత దగ్గర మార్గం రాయలపేట - మాధవరం రోడ్డు. ఈ మార్గం అభివృద్ధి చెందితే అటు ప్రజలకు, ఇటు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గతంలో టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి , ప్రస్తుత పలమనేరు శాసన సభ్యులు అమరనాథరెడ్డి ఎంతో ఉన్నతాశయంతో ఈ రోడ్డు అభివృద్ధి శ్రీకారం చుట్టారు. అందుకు అనుగుణంగా అటవీశాఖ అనుమతులు పొందారు. ఈ రహదారికి అటవీ స్థలం ఎంత అవసరమో దానికి అనుగుణంగా అటవీశాఖకు మరోచోట స్థలం కేటాయించారు. రాయలపేట నుంచి పెనుగొళకల 9.9 కిలోమీటర్లు, మాధవరానికి 13.8 కిలోమీటర్లు ఉండగా.. పెనుగొళకల నుంచి మాధవరానికి దాదాపు 4 కిలోమీటర్ల వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. 2018లో చెట్లను తొలగించి మట్టి పని సైతం పూర్తి చేశారు. 2019లో తారు రోడ్డు నిర్మాణం కోసం ఆర్‌ఆర్ ప్లాన్‌తో రూ.5.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఇందుకు అనుగుణంగా 2019 ఫిబ్రవరి 27వ తేదీన శంకుస్థాపన చేశారు. తరువాత ఎన్నికల నియమావళి అడ్డు రావడంతో పనులు ఆపారు. అనంతరం ప్రభుత్వం మారి నూతనంగా వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఈ రోడ్డు అభివృద్ధి పనులను పూర్తిగా మరుగున పడేశారు. మంజూరైన నిధులు సైతం రద్దు చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పలుమార్లు విలేఖర్ల సమావేశంల్లో మాట్లాడారు. ప్రజా ఉపయోగకరమైన అభివృద్ధి కార్యక్రమాలను ఆపరాదని.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. అయితే అప్పటి వైసీపి నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోవడంతో పాటు మంజూరైన నిధులను కూడా రద్దు చేశారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాంత ప్రజలు రహదారి అభివృద్ధి జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించి ఈ రహదారి అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు, రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

- కడా పీడీ వికాస్ మర్మత్



సీసీ టీవీ ఫుటేజీ చూపుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని కడా పీడీ వికాస్ మర్మత్ హెచ్చరించారు. కడా కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సోమవారం ఎత్తైన భవనం నుంచి మురుగేశ్ అనే పెయింటర్ మృతి చెందిన సంఘటనను ఉదహరించారు. ఈ సంఘటనపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు జరిగాయన్నారు. 108 అంబులెన్స్ ఆలస్యం కావడంతో సరైన చికిత్స అందక మృతి చెందాడని అసత్య ప్రచారాలు చేశారని, ఆ ప్రచారాలు పూర్తిగా తప్పని చెప్పారు. సీసీ కెమెరాల ఫుటేజీ తో జరిగిన సంఘటనను వివరించారు. పెయింటర్ మురుగేశ్ భవనంపై నుంచి కింద పడ్డాడని సమాచారం అందిన ఏడెనిమిది నిమిషాల లోపే 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుందని.. అక్కడి నుంచి మరో పన్నెండు నిముషాలలోపు గాయపడ్డ వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి చేర్చిందని చెప్పారు. అయితే సమాచారం అందాక అర్ధ గంటపైగా అంబులెన్స్ ఆలస్యం అయిందంటూ కొన్ని సామాజిక మాధ్యమాలు వీడియోలు ట్రోల్ చేయడం బాధాకరమన్నారు. ఇలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ.. ప్రభుత్వ సిబ్బందిపై తప్పుడు ప్రచారాలు చేయడం నేరమన్నారు. సమాచారం ప్రజలకు అందించే విషయంలో వాస్తవాలేవో, అవాస్తవాలేవో తెలుసుకోవాలని సూచించారు. అలా కాకుండా తప్పుడు ప్రచారాలు చేస్తే బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని కడా పీడీ హెచ్చరించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ మహ్మమ్మద్ షఫీ

కల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించాలని.. అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని అటవీశాఖ ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీలో అడవులకు నిప్పు పెడితే కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌వో మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడంతో చెట్లతోపాటు అనేక జీవరాసులు మృతి చెందుతున్నాయన్నారు. అగ్ని నుంచి అడవులను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవులకు నిప్పు పెట్టినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో హరిప్రియ, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుడుపల్లెలో..



కల్లూరులో...

గుడుపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు పేర్కొన్నారు. మంగళవారం జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్‌ను నిర్వహించారు. ఇళ్లతో పాటు బహిరంగ ప్రదేశాలు, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యలయాలు, ప్రార్థనా మందిరాలు శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కల్లూరు: పరిసరాల పరిశుభ్రత అందరి లక్ష్యం కావాలని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదలి, వీఆర్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో కల్లూరు లియోక్లబ్, లయన్స్‌క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామాపురంలో ఉచిత వైద్యసేవలు



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామంలో మంగళవారం తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ధూమపానం, మద్యపానంతో వచ్చే వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో అగస్త్రి స్కూల్ ఆవరణలో మంగళవారం మొగసాల ట్రస్టు సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యాధికారి ఆక్వెల్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

పిల్లలపై తల్లిదండ్రుల నిఘా తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు

పలమనేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలకు చదువుకునేందుకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు అన్నారు. సమాజంలో యువతలో ఆకర్షణ పెరిగిపోతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కళాశాలకు సక్రమంగా వెళ్తున్నారా, తరగతుల్లో అధ్యాపకుల బోధన సక్రమంగా వినడంతో పాటు ఇంటికి వచ్చినప్పుడు ఏమేరకు చదువుపై దృష్టి పెడుతున్నారో చూడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపుకార్డులు తప్పనిసరి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ శివకుమార్

గంగవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రభుత్వం అందించే గుర్తింపుకార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మేలుమాయి రైతు సేవాకేంద్రంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, ప్రధానమంత్రి బీమా యోజన తదితర పథకాల లబ్ధిని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గంగవరం వ్యవసాయశాఖ ఏవో హేమలత, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి రాజశేఖర్, రైతులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కోడామ్ డిస్టిలరీ తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీసీ విజయ్ కుమార్

కుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ డీకే.పల్లె పరిధిలోని కోడామ్ డిస్టలరీని మంగళవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్ శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే కుప్పం ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసులు, పరిష్కరించిన కేసులు, మద్యం అమ్మకాలు, బెల్టు షాపుల కట్టడి, పొరుగు రాష్ట్రాల మద్యం అదుపు చేయడం వంటివాటిపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, అరుణ, ఇతర ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



అరెస్టు చేసిన ముద్దాయిలతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

కుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం మఠం బస్టాప్ వద్ద మంగళవారం ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో ఓ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 40 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వాహనంతో పాటు మద్యాన్ని సీజ్ చేసిన అధికారులు తరలిస్తున్న కుప్పం మండలం బిరుదలనపల్లెకు చెందిన కె.బాబు, నాగభూషణంలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. దాడుల్లో కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్ బాబు, పలమనేరు సీఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జానపద వృత్తి కళాకారులసంఘం ఆధ్వర్యంలో మంగళవారం భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లె వద్ద తిరుపతి రమాదేవి మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురిని చికిత్సలకు తిరుపతి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యుల యాదగిరి, ఎల్లారెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సూచనలిస్తున్న జడ్పీ సీఈవో రవి కుమార్

సదుం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో రవి కుమార్ సూచించారు. మంగళవారం ఆయన సదుం మండల పరిషత్తు కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. తిమ్మానాయునిపల్లె కార్యదర్శి జగదీశ్‌పై గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన ఆయన నేరుగా జగదీశ్ వ్యవహార శైలిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో హరిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోభీ ఘాట్ పరిశీలన



సూచనలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి

సదుం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సదుంలో స్థానిక రజకులు, రియల్టర్ల మధ్య ఏర్పడిన స్థల వివాదాల ఫిర్యాదుపై స్పందించిన డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. రజకులకు సంబంధించిన సర్వే నెం.73/1లో 0.53 సెంట్ల భూమిని కొలతలు తీయించి హద్దులు గుర్తించారు. ఆ హద్దుల మేరకు ఉపయోగించుకోవాలని రజకులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు షణ్ముగం, సర్వేయర్లు, స్థానిక రజక సంఘ నాయకులు గోపాల్, నవీన్, గణేశ్, సుబ్రహ్మణ్యం, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి



పాలమందలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో భవాని



తిమ్మరాజుపల్లెలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసురాజు

సదుం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సమగ్ర భూరక్ష కార్యక్రమంలోని తప్పులను సరిదిద్దుతూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో భవాని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గత ఏడాది డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సు అర్జీలు, పరిష్కార పురోగతిపై మంగళవారం ఆర్డీవో సమీక్షించారు. సదస్సుల్లో అందిన అర్జీలలో 80 శాతానికి పైగా పరిష్కరించినట్లు తహసీల్దారు ఎస్.ఎం.హస్సేన్ ఆర్డీవోకు వివరించారు. అలాగే పాలమంద పంచాయతీలో జరుగుతున్న రీ-సర్వే పురోగతిని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● శాంతిపురం: శాంతిపురంలో జరిగే పైలెట్ రీసర్వేను పకడ్బందీగా చేయాలని ఆర్డీవో శ్రీనివాసురాజు సర్వే అధికారులకు సూచించారు. మంగళవారం తిమ్మరాజుపల్లెలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భూముల సంరక్షణతోనే కరువు నివారణ



మాట్లాడుతున్న వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్

పుంగనూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నీరు, భూముల సంరక్షణతోనే కరువును నివారించడానికి అవకాశాలు ఉన్నాయని వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మేలుందొడ్డి గ్రామంలోని రైతులకు వాటర్‌షెడ్‌తో కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో లీలామాధవి, పుంగనూరు ప్రాజెక్టు అధికారి ధనంజయవర్మ, ఏపీవో శివశంకర్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త గోవిందు మృతి



సదుం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ సీనియర్ కార్యకర్త గోవిందు(62) మంగళవారం ఉదయం హఠాత్తుగా మృతిచెందాడు. గోవిందు మృతి పట్ల టీడీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రత్న, బాబు, చంద్రయ్య, నాగరాజా, తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

మైనారిటీలకు అండగా టీడీపీ

రామకుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లిం, మైనారిటీలకు అన్ని విధాలా టీడీపీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సలాంసాబ్, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్ రఫీ, మైనారిటీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఆదిల్ తెలిపారు. మంగళవారం వారు ముస్లిం నేతలతో కలిసి రామకుప్పంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు రంజాన్ సమీపిస్తున్న వేళ మసీదులో ఉన్న మౌజంలు, ఇమాంలకు గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో వారికి నెలనెలా గౌరవ వేతనాలు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం చంద్రబాబు, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫారుక్ అబ్దుల్లాకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు నియాజ్, హఫీజ్, అక్బర్, హనీఫ్, జలీల్‌సాబ్, నిస్సార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఉలవపొట్టుకు నిప్పు

సోమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం అగ్రహారంపల్లెకు చెందిన పి.నరసింహులు, రవీంద్రకు చెందిన పొలంలో ఒబ్బిడి చేసిన ఉలవపొట్టును గ్రామ సమీపంలో నిల్వ చేశారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ఉలవపొట్టుకు నిప్పు పెట్టారు. దీంతో సుమారు రూ.40 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు సచివాలయంలో ఫిర్యాదు చేశారు.

జ్ఞానజ్యోతితో మెరుగైన విద్య



పుంగనూరులో...



కుప్పంలో శిక్షణ ఇస్తున్న ఎంఈవో



పలమనేరులో...

చౌడేపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి కార్యక్రమంతో అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన విద్యను అందించనున్నట్లు ఏసీడీపీవో అమరజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం ఆమె స్థానిక హైస్కూల్‌లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 6 రోజులపాటు జరుగనున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ● కుప్పం: కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జ్ఞాన జ్యోతి పేరుతో అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నోడల్ ప్రధానోపాధ్యాయుడైన జీడీపీ బాలికోన్నత పాఠశాల వెంకటేశ్వరబాబు ఆధ్వర్యంలో జరిగిన సాల్ట్, ఎన్ఈపీ 2020, ఐసీడీఎస్, నిపుణ భారతి తదితర అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ● కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఎంఈవోలు పోకల తాతయ్య, శిద్దరామయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు.

● గుడుపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను ఆకట్టుకునే విధంగా బోధన ఉండాలని ఎంపీడీవో రాధాకృష్ణ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. గుడుపల్లె ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ● బైరెడ్డిపల్లె: స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ తరగతులను ఎంఈవో సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. ● పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం పలు సూచనలు ఇచ్చారు. ● సోమల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలను ఆటపాటలతో ఆకర్షించాలని ఎంఈవో శివరత్న, సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ● పుంగనూరు రూరల్: ప్రాథమిక దశలోనే పిల్లల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ● సదుం: అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం సదుం, బూరగమంద జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో దామోదర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు

దోమలతో ఇబ్బంది పడుతున్న జనం

పెనుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలకు సరఫరా చేసిన ఫాగింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. రూ.25వేల నుంచి రూ.60వేల వరకు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ యంత్రాలను సచివాలయాలకు 2022 మే నెలలో అందించారు. ఇప్పటికీ వీటిని వినియోగంలోకి తేలేదు. ఇదిలా ఉంటే.. ఈ యంత్రాల వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వక పోవడమూ మరో కారణంగా తెలుస్తోంది. పెనుమూరు మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసినా మురుగు కాలువల నిర్మాణం చాలా వరకు చేపట్టలేదు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి.. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దుర్గంధంతోపాటు దోమలు పెరిగిపోయి జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఫాగింగ్ యంత్రాలను వినియోగం తేవాల్సిన అవసరం ఉంది.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు: జగన్మోహన్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దివ్యాంగుడు సాంబశివనాయుడు, ఎమ్మెల్యే జగన్మోహన్‌కు సన్మానం

గుడిపాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం కిలారిపల్లె, తుమ్మలవారిపల్లె న్యూకాలనీ, అరుంధతీయవాడ, చిత్తపార, బండపల్లె, అడవిచేను, వెప్పాలమానుచేను, గుడిపాల గ్రామాల్లో రూ.2.26 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను, సచివాలయాన్ని, మినరల్ వాటర్‌ప్లాంట్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలను చిన్న పిల్లల నుంచి దివ్యాంగులతో చేయిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం వసంతాపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు గ్రాస్‌కట్టింగ్ మిషన్లను పంపిణీ చేసి.. బండపల్లెలో ఓంశక్తి ఆలయ నిర్మాణానికి గ్రామస్తుల వినతితో రూ.50వేలను విరాళంగా అందించారు. మేయర్ అముద, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ జయంతి, ఎంపీడీవో శివరాజ్, ఈఈ ప్రసాద్‌నాయుడు, కూటమి నేతలు బాలాజీ నాయుడు, పీటర్, సాంబశివనాయుడు, మురళీ నాయుడు, అనిల్‌కుమార్, సుమతి, హరిప్రసాద్, స్వామినాథగౌడ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఆనందయాదవ్, నాగరాజయాదవ్, అర్జున్, శంకర్ చౌదరి, రవి నాయుడు, గోపి, శేఖర్ నాయుడు, ఐజాక్, ఏకాంబరం, శివలింగారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య లేకుంటే రైతులకు పథకాలందవు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విశిష్ట లేకుంటే రైతులకు పథకాలు అందవని వ్యవసాయశాఖ (డీఆర్‌సీ) మానిటరింగ్ ఆఫీసర్ విజయ్‌శంకర్‌రెడ్డి తెలిపారు. తూగుండ్రం, వరత్తూరు, ముక్కళత్తూరు గ్రామాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీచేశారు. మండల వ్యవసాయాధికారి భవాని మాట్లాడుతూ.. ఇప్పటివరకు 3241మంది రిజిస్ట్రేషన్ పూర్తయిందని చెప్పారు.

తవణంపల్లె: రైతులు విశిష్ట సంఖ్యను పొందాలని ఏడీఏ ఉమ తెలిపారు. మంగళవారం మారేడుపల్లె, వడ్డిపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రవీణ్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన సదస్సు

విజయపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కళియంబాకంలో టీబీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రీత్ సేఫ్ 360 టీబీ అలెర్ట్ ఇండియా వారి సహకారంతో నగరి టీబీయూనిట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 50మందికి స్క్రీనింగ్ చేసి, టీబీ లక్షణాలున్న 10మంది వద్ద శాంపిల్స్ తీసుకున్నారు. వైద్యాధికారులు సోమశేఖర్, విష్ణుప్రియ, సీహెచ్‌వో సుబ్బరామమ్మ, ఎస్‌ఐ బలరామయ్య, పీహెచ్‌ఎన్ భారతి, ఏఎస్‌ఐ గోవిందరాజులు, సర్పంచ్ విద్యాభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో తనిఖీలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన డాక్టర్ సుధారాణి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఒకే గది, ఒకే టాయిలెట్ ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె కొత్త భవనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకుముందు బంగారుపాళ్యం దళితవాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండల వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యాదమరి మండల సమావేశం

యాదమరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరగనున్నట్లు ఎంపీడీవో వేణు తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

దసబంద చెరువును 'చెర'పట్టారు!

సర్వేయర్ నివేదిక ఇచ్చినా ఆక్రమణదారులపై చర్యలేవి?

వెదురుకుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ వేణుగోపాలపురం రెవెన్యూ లెక్క దాఖలాలో ఉన్న దసబంద చెరువుకు ఆక్రమణదారుల చెరనుంచి విముక్తి లభించలేదు. మండలస్థాయి సర్వేయర్ ఆక్రమణలకు సంబంధించి నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు.

చెరువు పరిస్థితి ఇదీ: వేణుగోపాలపురం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబరు 147లో 50.06 ఎకరాలు, సర్వే నెంబరు 165లో 21.48 ఎకరాలు ఉంది. ఈ విస్తీర్ణంలో ఆక్రమణలు ఉన్నాయని గతంలో మండల, జిల్లా స్థాయి అధికారులకు వేణుగోపాలపురానికి చెందిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో 4.8.2021వ తేది నుంచి 6.8.2021వ తేది వరకు మండల సర్వేయర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.



నివేదిక ఇలా..: వేణుగోపాలపురం సర్వే నెంబరు 147లో 28 మంది, సర్వే నెంబరు 165లో ఏడుగురు ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించారు. వారు ఆక్రమించుకున్న స్థలాన్ని చూపిస్తూ వెదురుకుప్పం తహసీల్దార్‌కి నివేదిక ఇచ్చారు.

చర్యల్లో జాప్యం: మండల సర్వేయర్ ఆక్రమణదారుల వివరాలతో తహసీల్దార్‌కి నివేదిక ఇచ్చినా ఇప్పటికీ తగిన చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదంతా రెవెన్యూ లోపాయికారీ ఒప్పందాల వల్లేనన్న విమర్శలూ లేకపోలేదు.

28 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపినవారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు.. వాహనాల తనిఖీ చేశారు. 15 మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించారు. వీరిని మంగళవారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



తవణంపల్లె: మండలంలో ఎస్‌ఐ చిరంజీవి మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని అరెస్టు చేసి.. సెకండ్ క్లాస్ కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోతంబట్టుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(60) సోమవారం ఉదయం బహిర్భూమికని ఇంటినుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో మంగళవారం చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు భరత్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ సాయినాథ్

పెనుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనలో శుక్రవారం పెనుమూరు పోలీసుస్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా డీఎస్పీ సాయినాథ్ మంగళవారం చార్వాగానిపల్లె గ్రామంలో ఇరు వర్గాలతో మాట్లాడారు. గ్రామంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం.. ఆ తర్వాత వివాదాలు సృష్టించుకుని ఇలా కేసులు పెట్టుకోవడం వంటి పనులు చేయరాదని హెచ్చరించారు. ఆయనతోపాటు హెడ్ కానిస్టేబుల్ మధు ఉన్నారు.

ఎన్‌సీడీ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలి



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఐవో హనుమంతరావు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఎన్‌సీడీ, ఆర్బీఎస్కే సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి డీఐవో హనుమంతరావు సూచించారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని మాపాక్షి యూపీహెచ్‌సీ పరిధిలోని శేషాచలపురం గ్రామంలో జరుగుతున్న సర్వేలను పరిశీలించారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై చిదంబరేశ్వరుడు



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై విహరించారు. హాజరైన భక్తులకు ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



చెంగనపల్లెలో పరిశీలిస్తున్న వేణుగోపాల్

ఐరాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియ నివారణాధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కాణిపాకం పీహెచ్‌సీ సిబ్బందితో కలసి చెంగనపల్లె గ్రామాన్ని పరిశీలించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని ప్రజలకు సూచించారు. డాక్టర్లు స్వాతి సింధూర, రాజేశ్వరి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివసుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ వేదవతి, హెల్త్ సూపర్‌వైజర్లు నారాయణ, మనోహర్, నాగరత్న పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శ్మశానానికి స్థలమివ్వండి

యాదమరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని కొత్తపల్లె గ్రామస్తులు కోరుతున్నారు. 180 మజరా కొత్తపల్లె గ్రామస్తులు దామోదర్ నాయుడు, లోకనాథం, వెంకటేష్ నాయుడు మంగళవారం మీడియాతో మాట్లాడారు. గతంలో ఉన్న శ్మశాన వాటిక బెంగళూరు - చెన్నై రహదారి విస్తరణ చేపట్టడంతో పోయిందని చెప్పారు. అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయించాలని విన్నవించారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

పాలసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అంగన్వాడీ సిబ్బందికి సీడీపీవో వినుతాశ్రీ సూచించారు. మంగళవారం పాలసముద్రంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల

పూతలపట్టు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుండెకు భరోసా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను పూతలపట్టు వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, కుమార్ రాజా, వెంకటేశ్వరరావు మంగళవారం పీహెచ్‌సీలో విడుదల చేశారు. సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ఐరాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర హాస్టల్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఏఎస్‌డబ్ల్యూ నాగేశ్వరరావు మంగళవారం అందించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. వార్డెన్ సురేష్ పాల్గొన్నారు.

బారికేడ్ల వితరణ



నగరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరి పోలీస్‌స్టేషన్‌కు 15 బారికేడ్లను క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ వితరణ చేసింది. మంగళవారం వీటిని సీఐ మహేశ్వర్‌కు అందజేశారు. కంపెనీ ప్రతినిధులు తిరుపతి డీఎం జగదీష్, ఏరియా మేనేజర్ సిద్ధారెడ్డి, బీఎం వెంకటాచలపతి పాల్గొన్నారు.

బంగారమ్మకు విశేష పూజలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

వేతనాల చెల్లింపులను ఏజెన్సీలకు ఇవ్వొద్దు: ఏఐటీయూసీ

నగరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించే ప్రక్రియను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య నిరసన తెలిపారు. వేతనాల చెల్లింపు, పనుల నిర్వహణ మున్సిపల్ శాఖే చూసుకోవాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా భూ తగాదాలు పెట్టుకోవద్దు

● ప్రజలకు తహసీల్దార్ సూచన



వేణుగోపాలపురంలో వివాదాస్పద స్థలంపై విచారిస్తున్న తహసీల్దారు

పెనుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనవసరంగా భూ తగాదాలు పెట్టుకోవద్దని ప్రజలకు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేసి.. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని వీడియో విడుదల చేసిన ఠాణావేణుగోపాలపురానికి చెందిన సుబ్రహ్మణ్యం వివాదాస్పద స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. 2007లో అదే గ్రామానికి చెందిన విజయమ్మకు 20 సెంట్ల పట్టా ఇచ్చారని.. అందులో ఐదేళ్ల కిందట సుబ్రహ్మణ్యం షెడ్డు నిర్మించాడన్నారు. ఇరు వర్గాలకు దారి సమస్య ఉండటంతో.. ఇప్పుడు ఒకరిపై, ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం వడ్డిగుడిసెలు గ్రామంలో రోడ్డు పోరంబోకులో అక్రమంగా నిర్మాణం చేపట్టిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేయడం.. అతడిపై ఆమె ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఇద్దరికీ నోటీసులు జారీ చేశామని వివరించారు. మండలంలో అధికంగా ప్రజలు అనవసర తగాదాలు పెట్టుకోవడం.. ఫిర్యాదులు చేసుకోవడం ఎక్కువైందన్నారు. ఇకనైనా ఇటువంటివి ఆపకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుర్గాంబ సేవలో ఎమ్మెల్యే



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబను మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్ తదితరులు స్వాగతం పలికారు. ఈవో మునిశేఖర్ తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలోనూ ఎమ్మెల్యే పూజలు చేశారు. బజారువీధి శివషణ్ముగ సుందర వినాయక ఆలయ కుంబాభిషేక వార్షికోత్సంలో పాల్గొన్నారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గుడిపాల బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

పన్నూరు దళితవాడలో రోజా

విజయపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి.. అండగా ఉంటానని వైసీపీ కార్యకర్తలకు మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా కల్పించారు. మంగళవారం పన్నూరు దళితవాడలో ఆమె పర్యటించారు. వైస్ ఎంపీపీ బాలాజి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమార్, వైసీపీ మండల అధ్యక్షుడు శివరాజు, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, ఈజీ బాబు, వెంకటేసులు, శేఖర్‌రాజు, పాండ్యన్, చెంగల్‌రాయలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ప్రారంభం

తవణంపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి ప్రారంభించారు. సీడీపీవో నిర్మల, హెచ్ఎం దేవరాజులురెడ్డి, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

నిండ్ర: కొత్త ఆరూరు ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణను ప్రారంభించారు. ఎంఈవో శ్రీధర్ రాజు, హెచ్‌ఎంలు శివయ్య, గిరిజావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నగరి: పీసీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని పీడీ డి.వెంకటేశ్వరి పరిశీలించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు, సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధంగా ఉండాలి

ఐరాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధంగా ఉండాలని ఎంపీడీవో ధనలక్ష్మి సూచించారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. హెచ్ఎం కోమల పాల్గొన్నారు.